ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 శనివారం 30 ఆగస్టు 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## లాభాల్లో మొదలైన మార్కెట్లు

వరుసగా రెండు రోజుల నష్టాల తర్వాత భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం (ఆగ స్టు 29, 2025) లాభాలతో ప్రారంభమయ్యాయి. మార్కె ట్లలో నెలకొన్న అనిశ్చితికి కొంత విరామం లభించి నట్లు కనిపిస్తోంది.ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 130 పాయింట్లు లాభపడి 80,209 వద్ద, నిఫ్టీ 43 పాయింట్లు వృద్ధి చెంది 24,537 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ సానుకూల ధోరణి ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. నేటి మార్కెట్లలో కొన్ని ప్రముఖ కంపెనీల షేర్లు లాభాలను నమోదు చేశాయి. ప్రస్తుతానికి లాభాల్లో ఉన్న షేర్లలో హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ×ుజ, ట్రెంట్, మరియు కోటక్ బ్యాంక్ ఉన్నాయి. ఈ షేర్లు మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడ్డాయి. అయినప్పటికీ, అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



# కాళేశ్వరం అవినీతిపై ప్రజల్లోకి..


## నేటి నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై చర్చకు కాంగ్రెస్ వ్యూహం

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికతో బీఆర్ఎస్‌పై దాడికి సన్నద్ధం
- అసెంబ్లీలో చర్చ ద్వారా విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం
- కమిషన్ విచారణపై పీపీటీకి చాన్స్ ఇవ్వాలంటున్న బీఆర్ఎస్
- నివేదికను అడ్డం పెట్టుకొని బురదజల్లే ప్రయత్నమంటూ ఆరోపణ
- సీబీఐ విచారణకు డిమాండ్ చేయనున్న బీజేపీ
- ఈ సమావేశాల్లోనే అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక
- నాలుగు రోజులపాటు సమావేశాలు జరిగే అవకాశం

హైదరాబాద్

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సభలో వ్యవహరించాల్సిన తీరుపై అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ వ్యూహ, ప్రతివ్యూహాలతో సిద్ధమయ్యాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శల దాడికి అధికార పార్టీ సిద్ధమవుతోంది. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికార పక్షం నుంచి ఎదురయ్యే విమర్శల దాడిని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా ప్రాజెక్టు గురించి పూర్తిగా వివరించేందుకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టనుందని తెలిసింది. ఇంకోవైపు కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై - మిగతా2లో



# జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

- టోక్యోలో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రధాని మోదీ
- ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపే చూస్తోందన్న ప్రధాని
- త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ధీమా
- చైనాతో సంబంధాల బలోపేతానికి భారత్ సిద్ధంగా ఉంది
- పరస్పర గౌరవం, ప్రయోజనాలే కీలకం అన్న ప్రధానమంత్రి మోదీ
- జపాన్ పర్యటనలో ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడి
- ఎస్సీఓ సదస్సు కోసం చైనాలోని టియాంజిన్‌కు ప్రధాని పయనం
- భారత్-చైనా బంధం ప్రపంచ శాంతికి దోహదపడుతుందని వ్యాఖ్య
- ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఇరు దేశాల కలయిక అవసరం

# చేలన్నీ చెరువులే..



- వర్షాలు, వరదలతో 2.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా
- కామారెడ్డి, మెదక్, తదితర జిల్లాల్లో పంటల మునక
- పొలాల్లో ఇసుక మేటలు.. మంత్రి తుమ్మల సమీక్ష
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో లక్ష ఎకరాల వరకు నష్టం వాటిల్లగా, మెదక్, నిజామాబాద్, భూపాలపల్లి, సిద్దిపేట, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట తదితర జిల్లాల్లో జరిగిన నష్టంపై ప్రాథమిక వివరాలను అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి పంపించారు. కామారెడ్డి, మెదక్‌లో అపార నష్టం క్షేత్రస్థాయి నుంచి అందిన సమాచారం ప్రకారం.. ముఖ్యంగా - మిగతా2లో

# ఒత్తిడి పెంచే వ్యూహం!

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% కోటాపై సర్కారు దృష్టి

- అసెంబ్లీ ముందుకు పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు?
- పార్టీల అభిప్రాయం తీసుకోవడం ద్వారా పైచేయి సాధించే వ్యూహం
- శాసనసభ ద్వారా బిల్లును గవర్నర్‌కు పంపే ప్రణాళిక
- అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ఆధారంగా 42% రిజర్వేషన్లపై అధికారిక ఉత్తర్వులు?



హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన చట్టానికి అసెంబ్లీలో సవరణను ప్రతిపాదించనుంది. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ శనివారం నుంచి ప్రారంభం కానున్న వర్షాకాల సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పంచాయతీరాజ్ చట్టం%–%2018లోని సెక్షన్ 285 (ఏ)కు సవరణ ప్రతిపాదిస్తూ పెట్టే ఈ బిల్లుపై చర్చించి అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను తీసుకోవడం ద్వారా అటు చట్టబద్ధంగా, - మిగతా2లో



# రాహుల్ సభపై దుమారం


- ప్రధాని మోదీ తల్లిపై కొందరు దుర్భాషలాడినట్టు ఆరోపణలు
- బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ
- పట్నాలో రాహుల్ గాంధీపై కేసు
- రాహుల్ క్షమాపణ చెప్పాలన్న షా
- ఓటర్ అధికార్ యాత్రకు బ్రహ్మరథం అందుకే బీజేపీ కుట్రలు: కాంగ్రెస్

# కొత్తగా రూ.6 వేల కోట్ల రుణం!

## సేకరణకు ఆర్థికశాఖ కసరత్తు.. వేలానికి ప్రభుత్వ బాండ్లు

హైదరాబాద్

కొత్తగా రూ.6 వేల కోట్ల రుణసేకరణకు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రభుత్వ బాండ్లను వేలానికి పెట్టింది. ఈమధ్యకాలంలో ఒకేసారి ఈ స్థాయిలో రుణాలను సేకరించడం ఇదే తొలిసారి. గత జూన్‌లో రైతుభరోసా పథకానికి అవసరమైనప్పుడు ఇలాగే ఒకేసారి రూ.4 వేల కోట్లు తీసుకున్నారు. రాష్ట్రంలో వరదలతో - మిగతా2లో




# రాబడికి భద్రతేది?

- జీఎస్టీ హేతుబద్ధీకరణతో తెలంగాణకు 7వేల కోట్ల నష్టం
- రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలి
- పన్ను తగ్గింపు.. పేద, మధ్య తరగతికి లబ్ధి చేకూర్చాలి
- రాబోయే జీఎస్టీ కౌన్సిల్ భేటీలో సందేహాలన్నీ లేవనెత్తుతాం
- జీఎస్టీ హేతుబద్ధీకరణ సంప్రదింపుల సమావేశంలో భట్టి
- రాష్ట్రంలో వరద నష్టం నివేదిక కేంద్రానికి పంపుతామని వెల్లడి
- జీఎస్టీ రేట్లు మారిస్తే రాష్ట్రాల రాబడికి 2 లక్షల కోట్ల గండి




న్యూఢిల్లీ

జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించే సమయంలో రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. రేట్ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, కేంద్రం నేరుగా లేదా కౌన్సిల్ ద్వారా రాష్ట్రాలను సంప్రదించాలని, కానీ.. రేట్ల హేతుబద్ధీకరణ ప్రకటన ఏకపక్షంగా జరిగిందని అన్నారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, ఎన్నో ఆకాంక్షలు ఉన్నాయని, నిధులు అవసరమని తెలిపారు. సరైన పన్ను విధింపు.. రాష్ట్ర అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించడం తెలిసిందే. ఈ మేరకు - మిగతా2లో

# కాళేశ్వరం అవినీతిపై ప్రజల్లోకి..

-మొదటిపేజీ తరువాయి

విచారణను సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేసే అవకాశముంది.

**నాలుగు రోజులపాటు సమావేశాలు?**

శనివారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ ఉభయ సభల సమావేశాలు నాలుగు రోజులపాటు కొనసాగే అవకాశమున్నట్లు సమాచారం. తొలిరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం తెలిపిన అనంతరం అసెంబ్లీ వాయిదా పడనుంది. అనంతరం శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన వేర్వేరుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు జరుగుతాయి. స్పీకర్ అధ్యక్షతన జరిగే బీఏసీ భేటీలో అసెంబ్లీ సమావేశాలు జరిగే తేదీలు, రోజువారీ ఎజెండాను ఖరారు చేయనున్నారు.
పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ, బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, యూరియా కొరత, వరద నష్టం, ప్రభుత్వ పరంగా పునరావాసం, సహాయక చర్యలు, గురుకుల విద్యా సంస్థల్లో సమస్యలు వంటి అంశాలను ఎజెండాలో చేర్చాలని అధికార, విపక్షాలు పట్టుబట్టే అవకాశాలు ఉన్నాయి. వినాయక నిమజ్జనం నేపథ్యంలో సమావేశాలను వీలైనంత త్వరగా ముగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత సమావేశాల్లోనే శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసే అవకాశముంది. ఈ మేరకు శనివారం స్పీకర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు అసెంబ్లీ వర్గాలు తెలిపాయి.

**కాళేశ్వరం అవినీతిపై ప్రజల్లోకి..**

అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను బహిర్గతం చేసే విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, పార్టీల విమర్శలు, ప్రతి విమర్శలు, కోర్టు కేసులు.. ఇలా అన్నింటికి ఈ సమావేశాల్లోనే జవాబు చెప్పేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బలంగా వాదిస్తూ అసెంబ్లీ రికార్డుల్లోకి ఎక్కించాలనేది అధికార పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ఇలా నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని భావిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళిక, నాణ్యత, నిర్వహణ విషయాల్లో నిర్లక్ష్యం కారణంగానే మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని, ఈ ప్రాజెక్టు పరిధిలో నీటిని నిల్వచేయొద్దని ఎన్‌డీఎస్‌ఏ సూచించినందున ఈ ప్రాజెక్టును ఎలా వినియోగించుకోవాలనే అంశంపై అన్ని పార్టీల అభిప్రాయాలను ప్రభుత్వం కోరనుంది.
ఘోష్ నివేదికపై చర్యల కంటే దానిపై చర్చ జరగడమే ప్రధానమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కమిషన్ నివేదిక ఆధారంగా దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేయడ మాత్రమే తమ ఉద్దేశం కాదని, అవసరమైతే బీజేపీ కోరుతున్నట్టు సీబీఐ విచారణకు కూడా వెనుకాడేది లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.
అసెంబ్లీలోనే ఎండగట్టే వ్యూహంతో బీఆర్‌ఎస్
పీసీ ఘోష్ కమిషన్‌పై చర్చ, సిట్ ఏర్పాటు పేరిట ఇరకాటంలోకి నెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలను అసెంబ్లీ వేదికగానే తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, సీనియర్ నేతలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో వరదల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించటాన్ని బీఆర్‌ఎస్ తప్పుపడుతోంది. ఘోష్ కమిషన్ నివేదికపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన బీఆర్‌ఎస్.. సోమవారం మరోసారి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. న్యాయస్థానంలో విచారణ జరగమునుపే అసెంబ్లీలో నివేదికను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం తమపై బురద చల్లే ప్రయత్నంలో ఉందని బీఆర్‌ఎస్ ఆరోపిస్తోంది.
అసెంబ్లీ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టుపై పీపీటీ ఇచ్చేందుకు అవకాశమివ్వాలని పట్టుబడుతోంది. ప్రభుత్వంలో అవినీతి, గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టు, నీటిపారుదల ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగింత వంటి అంశాలను లేవనెత్తి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని భావిస్తోంది. ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో జరిగే చర్చలో ప్రతిపక్ష నేత కేసీఆర్ పాల్గొంటారా లేదా అనే అంశంపై బీఆర్‌ఎస్ గోప్యత పాటిస్తోంది. ఎరువుల కొరత, వరద నష్టంపై ప్రభుత్వం స్పందన వంటి అంశాలపై చర్చ కోసం పట్టుబట్టే వ్యూహంపై బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది.

**సీబీఐ విచారణకు బీజేపీ పట్టు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు కోసం పట్టుబట్టాలని బీజేపీ శాసనసభా పక్షం నిర్ణయించింది. సీబీఐ విచారణ ద్వారానే నిజాలు నిగ్గు తేలుతాయని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సన్నద్ధమవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సీబీఐ విచారణ కోసం మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్న బీజేపీ.. అసెంబ్లీలోనూ అదే వైఖరిని కొనసాగించాలని నిర్ణయించింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై కేంద్ర ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలను కూడా తిప్పికొట్టాలని భావిస్తోంది. సిట్ ఏర్పాటులో ప్రభుత్వం చేస్తున్న తాత్సారాన్ని కూడా నిలదీయాలని బీజేపీ నిర్ణయించింది. కాగా ఎంఐఎం, సీపీఐ పార్టీలు అధికారపక్షానికి మద్దతుగా నిలవనున్నట్లు సమాచారం.

# రాబడికి భద్రతేది?




-మొదటిపేజీ తరువాయి

జీఎస్టీని ప్రస్తుతం విధిస్తున్న 5, 12, 18, 28 శాతం స్లాబ్‌లలో కాకుండా.. రెండు స్లాబ్‌లలో 5 నుంచి 18 శాతం మ?ధ్య నిర్ణయించాలని, అతివిలాస, హానికర వస్తువులపై మాత్రమే 40 శాతం జీఎస్టీ విధించాలని కేంద్రం సూచించింది. దీంతో ఎనిమిది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, పశ్చిమబెంగాల్‌ల ఆర్థిక మంత్రులు శుక్రవారం ఢిల్లీలో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రాలకు తగ్గే ఆదాయానికి పరిహారం చెల్లిస్తామంటూ జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో జీఎస్టీ ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారని, కానీ.. ఆశించినంతగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక స్వేచ్ఛతో వ్యాట్‌ను కొనసాగించి ఉంటే 2024–25కు ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేదని, కానీ.. జీఎస్టీ ద్వారా ఆదాయం రూ.42,443 కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. రాష్ట్ర సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వసూళ్లు 39 శాతమేనని, అందువల్ల జీఎస్టీ రేట్లలో ఏమైనా తగ్గింపులు ఉంటే.. కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెప్పారు. తెలంగాణ జీఎస్టీ, జీఎసడీపీ నిష్పత్తి 2022– 23లో 3.07 శాతం నుంచి 2024 – 25లో 2.58 శాతానికి క్రమంగా తగ్గుతోందని, రేటు హేతుబద్ధీకరణ దీనిని మరింత తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణకు తెలంగాణ మద్దతు ఇస్తుందని, కానీ రెండు తీవ్రమైన సమస్యలను పరిష్కరించాలని భట్టి డిమాండ్ చేశారు. మొదటిది.. రాష్ట్రాల ఆదాయాలను రక్షించాలని, రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను కొనసాగించేలా తగిన పరిహార విధానాన్ని రూపొందించాలని అన్నారు. రెండోది.. పన్ను తగ్గింపు లేదా మినహాయింపు నిజంగా సమాజంలోని పేద, మధ్యతరగతి వర్గాల సమూహాలకు చేరేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబరు 3న మరోసారి సమావేశమై కీలక అంశాలపై చర్చించి.. కేంద్రానికి నివేదిస్తామని తెలిపారు. కేంద్ర నిర్ణయంతో చాలా రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, అందులో.. ఎన్డీయే పాలిత రాష్ట్రాలూ ఉన్నాయని గుర్తు చేశారు. అందుకే, జీఎస్టీ హేతుబద్ధీకరణ అంశంపై కేంద్రం మరింత లోతుగా ఆలోచించాలని కోరారు. కాగా, తెలంగాణలో వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారని తెలిపారు. వీలైనంత త్వరగా నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించి ఆర్థికసాయం కోరతామన్నారు.

**రాష్ట్రాల ఆదాయానికి రూ.2 లక్షల కోట్ల నష్టం..**

జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ వల్ల రాష్ట్రాల ఆదాయానికి రూ.1.5 లక్షల కోట్లనుంచి రూ.2 లక్షల కోట్ల మేరకు గండి పడుతుందని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తెలిపాయి. తమకు ఈ నష్టాన్ని ఎలా చెల్లిస్తారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని సవాల్ చేశాయి. కొత్త జీఎస్టీ వల్ల రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోవడం మాత్రమే కాకుండా.. ఆదాయం బాగా తగ్గిపోయి రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశాయి. విలాస వస్తువుల మీద అదనపు లెవీపై వచ్చే వసూళ్ల ఆధారంగా కేంద్రం రుణాలను సేకరించి తమకు చెల్లించాలని ఆర్థిక మంత్రుల సమావేశంలో డిమాండ్ చేశాయి. సెప్టెంబరు 3, 4 తేదీల్లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తాలని, నష్టపరిహారం చెల్లించేందుకు ఒక యంత్రాంగం ఏర్పాటు కోసం డిమాండ్ చేయాలని నిర్ణయించాయి. విలాస వస్తువులపై 40 శాతానికి పైగా అదనపు సుంకాన్ని విధించి.. ఆ ఆదాయాన్ని రాష్ట్రాలతో పంచుకోవాలని కేంద్రానికి సూచించాయి. కాగా, జీఎస్టీ రేట్ల హేబద్ధీకరణ వల్ల 15 నుంచి 20 శాతం ఆదాయాన్ని కోల్పోతుందని, దీనివల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుదేలవుతుందని కర్ణాటక ఆర్థిక మంత్రి బైరెగౌడ అన్నారు. రాష్ట్రాల ఆదాయాలు కుదుటపడే వరకు ఐదేళ్లపాటు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో భట్టివిక్రమార్క, కృష్ణ బేరెగౌడతోపాటు పంజాబ్, కేరళ, జార?ండ్, తమిళనాడు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు.

# బడుల్లో ముఖ గుర్తింపు హాజరు!

హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు అందించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ విధానంతో హాజరు శాతం మెరుగుపడి, సాంకేతిక విద్యా కళాశాలల్లో లోటుపాట్లను సరిదిద్దడానికి అవకాశం దొరుకుతుందని చెప్పారు. విద్యారంగంపై పెడుతున్న ఖర్చును తాము పెట్టుబడిగా చూస్తున్నామన్నారు. శుక్రవారం విద్యాశాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు బాగా పెంచాలని పిలుపునిచ్చారు. అదనపు గదులు, వంట గదులు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని, నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి వీలుగా ఒకే విభాగం కిందకు తేవాలని ఆదేశించారు. 'యంగ్ ఇండియా' సమగ్ర గురుకుల పాఠశాలల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ(ఈడబ్ల్యూఐడీసీ) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి తావు లేకుండా గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని, చెల్లింపుల్లో ఎలాంటి అలసత్వం చూపొద్దని కోరారు. మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం వంటకాల కోసం కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని, వాటిపైన సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే కాంట్రాక్ట్ ప్రాతిపదికన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. బాలికల గురుకుల పాఠశాలల్లో మహిళా కౌన్సెలర్లను నియమించాలని సూచించారు. యంగ్ ఇండియా పాఠశాలలతో పాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారని సీఎం వెల్లడించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలేనని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలతో నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



## కొత్తగా రూ.6 వేల కోట్ల రుణం!

-మొదటిపేజీ తరువాయి

భారీగా ఆస్తినష్టం సంభవించడంతో పలు శాఖలు విపత్తు సాయం కింద నిధులు అడుగుతున్నాయి. రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో వాటికి తక్షణ మరమ్మతులు చేయించాల్సి ఉంది. వాటికి అవసరమైన నిధులు ఆర్థికశాఖ నుంచి ఆయా శాఖలకు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది.
ఉద్యోగుల పెండింగు బిల్లులకు నెలకు రూ.700 కోట్లు చొప్పున దశలవారీగా విడుదల చేయాలని గత జూన్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ నెల కోటా నిధులు ఇంకా విడుదల చేయాల్సి ఉంది. ఈ ఏడాది(2025–26)లో మొత్తం రూ.54,009 కోట్ల కొత్త రుణాలను బహిరంగ మార్కెట్ నుంచి సేకరించాలని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటిలో తొలి నెల ఏప్రిల్‌లో రూ.5,230.99 కోట్లు, మేలో రూ.4,500 కోట్లు, జూన్‌లో రూ.8,500 కోట్లు, జులైలో రూ.6 వేల కోట్లు తీసుకుంది. ఇప్పుడు రూ.6 వేల కోట్లతో కలిపి మొత్తంగా రూ.30 వేల కోట్ల రుణాల సమీకరణ పూర్తవుతుంది. అయినా ఇంకా భారీగా నిధులు అవసరం. పలు పథకాలకు జులై నుంచి సెప్టెంబరులోగా రెండో త్రైమాసికం నిధులు విడుదల చేయాలి. జీఎస్టీ, వ్యాట్ వసూళ్లలో అక్రమాలను అరికట్టి ఆదాయం పెంచాలని వాణిజ్యపన్నులు, ఎక్సైజ్ శాఖలకు ప్రభుత్వం సూచించింది.

**రూ.12,564 కోట్లకు చేరిన లోటు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.2,738.33 కోట్ల రెవెన్యూ రాబడి మిగులు ఉంటుందని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వ అంచనా. కానీ ఇప్పటికే రెవెన్యూ రాబడి లోటు రూ.12,564 కోట్లు దాటిపోయింది. మిగులు ఉంటుందనుకుంటే ఏకంగా ఇంత భారీస్థాయిలో లోటు ఏర్పడటంతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేయడం ఆర్థికశాఖకు కత్తిమీద సాములా మారింది. ఆర్థిక ద్రవ్యలోటు ఈ ఏడాది రూ.54 వేల కోట్లు ఉండవచ్చని అంచనా. ఇప్పటికే ఇది రూ.30 వేల కోట్లకు చేరడంతో దాన్ని పూడ్చేందుకు కొత్త రుణాలను సేకరించింది. పాత బాకీలపై వడ్డీల చెల్లింపునకే రూ.12 వేల కోట్లు వెచ్చించారు.

ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డు ఉద్యోగుల పింఛన్లకు కలిపి మరో రెండు, మూడు రోజుల్లో ఒకటో తేదీ నుంచి రూ.5,500 కోట్లకు పైగా విడుదల చేయాల్సి ఉంది. ఇవికాకుండా సంక్షేమ పథకాలకు, రాయితీలకు నెలకు రూ.2 వేల కోట్ల వరకూ అవసరం. ఇవన్నీ తప్పనిసరి చెల్లింపులు కాగా ఇప్పుడు అనూహ్యంగా వరదల బీభత్సంతో పలు శాఖల తరపున తక్షణం అదనంగా నిధులు వెచ్చించి విపత్తు నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది.

## ఒత్తిడి పెంచే వ్యూహం!

-మొదటిపేజీ తరువాయి

ఇటు రాజకీయంగా పైచేయి సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. వాస్తవానికి ఇదే అంశంపై రాష్ట్ర మంత్రివర్గం చేసిన ఆర్డినెన్సును గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. ఆ ఆర్డినెన్సు రాష్ట్రపతికి వెళ్లి దాదాపు రెండు నెలలవుతున్నా ఇంకా అది పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలో సాంకేతిక అంశాలు సానుకూలంగా ఉంటే ఆర్డినెన్సులో స్వల్ప మార్పుతో అసెంబ్లీలో బిల్లు పెట్టి మరోమారు గవర్నర్‌కు పంపడం ద్వారా ఒత్తిడి పెంచాలనే వ్యూహంతో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో అసెంబ్లీలో బిల్లు పెట్టడంపై తీర్మానం చేసే అవకాశం ఉంది.

**కోర్టుల ముందుకు 'ఏకాభిప్రాయం'!**

ఈ బిల్లుపై ప్రధాన రాజకీయ పక్షాలైన బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐల అభిప్రాయాలు తీసుకోవడం ద్వారా రిజర్వేషన్ల పరిమితి విషయంలో రాజకీయ ఏకాభిప్రాయం ఉందనే వాదనను కోర్టుల ముందు ఉంచవచ్చనేది కూడా ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. మరోవైపు ఈ బిల్లు విషయంలో బీజేపీ వినిపించే అభిప్రాయాన్ని బట్టి ఆ పార్టీని ఇరుకున పెట్టాలని, తాము చేస్తున్న పోరాటాన్ని మరోమారు బీసీలకు వివరించేందుకు ఈ సమావేశాలను వేదికగా ఉపయోగించుకోవాలనే రాజకీయ ఎత్తుగడతో ప్రభుత్వం ముందుకెళుతోందని అంటున్నారు. ఈ బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదిస్తే, దీని ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు కూడా విడుదల చేయనుందని సమాచారం.

## చేలన్నీ చెరువులే..

-మొదటిపేజీ తరువాయి



కామారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునగడం, ఇసుక మేటలు వేయడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, ఎల్లారెడ్డి, రామారెడ్డి మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అలాగే జుక్కల్ నియోజక వర్గంలోని పిట్లం, పెద్దకొడప్‌గల్, మహ్మద్‌నగర్, నిజాంసాగర్, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో వందలాది ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. ఇక కామారెడ్డి నియోజక వర్గంలోని కామారెడ్డి, భిక్కనూరు, బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట మండలాల్లో, అలాగే బాన్సువాడలో పంటలు నీట మునిగాయి. మెదక్ జిల్లాలో ఇసుక మేటలు వేసి పంట చేతికందకుండా పోయింది. భారీగా వరద నీరు చేరడంతో పంట చేనులు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రధానంగా వరి, పత్తి, చెరుకు పంటలకు నష్టం వాటిల్లింది. నార్సింగి జాతీయ రహదారి పక్కన ఉన్న గన్నేరు వాగుకు వరద పోటెత్తడంతో పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నిర్మల్ జిల్లా భైంసా మండలం సిరాల ప్రాజెక్టు అలుగు వరదతో సిరాల, దేగాం గ్రామాల్లో పత్తి, సోయా పంటలు నీటమునిగాయి. శ్రీరాంసాగర్ అవుట్ ఫ్లో వరద కారణంగా లక్ష్మణచాంద, ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

**మండలాల వారీగా వివరాలు సేకరించండి: మంత్రి**


శుక్రవారం అధికారులతో సమావేశమైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మండలాల వారీగా జరిగిన నష్టం వివరాలను సేకరించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని, అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటనష్టంపై సమగ్ర నివేదిక తయారుచేయాలని సూచించారు.
ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. గోదావరి వరద ప్రవాహ ఉధృతి పెరగడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడం జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారిని ఆదేశించారు.

**త్వరలో 21,325 మెట్రిక్ టన్నుల యూరియా**

రామగుండం ఎరువుల పరిశ్రమ (ఆర్ఎఫ్‌సీఎల్)లో యూరియా ఉత్పత్తి నిలిచి పోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని తుమ్మల తెలిపారు. రానున్న రెండురోజుల్లో రాష్ట్రానికి వివిధ కంపెనీల నుంచి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వెల్లడించారు. కాగా,సెప్టెంబర్ ఎరువుల కోటాను బకాయితో కలిపి వెంటనే విడుదల చేయాలని మరోసారి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు.

# జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలు కేవలం మన వృద్ధిని గమనించడమే కాకుండా మనపై గట్టి నమ్మకంతో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మోదీ... టోక్యోలో జరిగిన ఇండియా–జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మనదే" అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా, అవి రెట్టింపు అవుతున్నాయని ఆయన వివరించారు. భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమే కాదని, అదొక స్మార్ట్ బంధమని ప్రధాని అభివర్ణించారు. ఈ రెండు దేశాల కలయిక ఆసియా శతాబ్దంలో స్థిరత్వం, వృద్ధి, శ్రేయస్సును నిర్దేశిస్తుందని ఆయన అన్నారు. సాంకేతిక రంగంలో భారత్, జపాన్ కలిసి పనిచేసే అవకాశాలపై మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారత్ ఎంతో ధైర్యమైన, ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపట్టింది. జపాన్ సాంకేతికత, భారత ప్రతిభావంతుల మేధస్సు కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించవచ్చు" అని మోదీ తెలిపారు. ఈ



రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు ఉమ్మడి శ్రేయస్సుగా మారాయని, జపాన్ వ్యాపారాలకు భారత్ ఒక మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు.

**చైనాతో బంధంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు.. ఆ మూడే ఆధారం!**

భారత్, పొరుగు దేశమైన చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనాలు, పరస్పర సున్నితత్వం అనే మూడు కీలక సూత్రాల ఆధారంగా వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృష్టితో ఈ బంధాన్ని బలోపేతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం రెండు రోజుల జపాన్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ, శుక్రవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు తాను జపాన్ నుంచి నేరుగా చైనాలోని టియాంజిన్ నగరానికి వెళ్లనున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. అక్కడ జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. గత ఏడాది కజన్‌లో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలలో సానుకూల పురోగతి కనిపిస్తోందని మోదీ గుర్తు చేశారు. "భూమిపై అతిపెద్ద దేశాలు, పొరుగున ఉన్న భారత్–చైనాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగితే, అది కేవలం ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచ శాంతి, శ్రేయస్సుకు కూడా ఎంతో మేలు చేస్తుంది," అని ప్రధాని అభిప్రాయపడ్డారు. బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచం ఏర్పడటానికి ఇది చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అస్థిరతను ప్రస్తావిస్తూ, ఆర్థికంగా బలమైన దేశాలైన భారత్–చైనా కలిసి పనిచేయడం ఎంతో అవసరమని మోదీ నొక్కిచెప్పారు. ప్రపంచ ఆర్థిక క్రమానికి స్థిరత్వం తీసుకురావడంలో ఇరు దేశాల భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత పర్యటనకు రావడం, ఇప్పుడు ప్రధాని మోదీ చైనాకు వెళ్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# మూడు లక్షల ఓటర్లకు ఈసీ నోటీసులు

౦౦౦౦బీహార్ ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మరో మలుపు తీసుకుంది. తాజాగా భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) బీహార్‌లో ఉంటున్న మూడు లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసింది. వీరు బంగ్లాదేశ్, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందినవారిగా అనుమానిస్తూ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ)నోటీసులను పంపారు. రాష్ట్రంలో కొన్ని లక్షల మంది ఓటరు సవరణల కోసం సమర్పించిన పత్రాలలో వ్యత్యాసాలు కనిపించిన దరిమిలా వారికి ఈసీ నోటీసులు జారీ చేసింది. మొత్తం మూడు లక్షలమంది ఈ తరహా నోటీసులు అందుకున్నారు. వారి పత్రాలలో వ్యత్యాసాలు ఎందుకు ఉన్నాయో వివరించేందుకు వారికి ఈసీఐ ఏడు రోజులు గడువు ఇచ్చింది. 'మూడు లక్షల మంది ఎస్ఐఆర్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకున్నారు. అయితే వారి పత్రాల పరిశీలనలో వ్యత్యాసాలు కనిపించాయి. దీంతో క్షేత్ర స్థాయిలో తనిఖీలు జరిగాయి. ఫలితంగా వీరు బంగ్లాదేశ్, మయన్మార్ లేదా నేపాల్ నుండి వచ్చి ఉండవచ్చనే అనుమానాలు నెలకొన్నాయని అని ఒక అధికారి మీడియాకు తెలిపారు. ఈసీ నోటీసులు పంపి, వివరణ కోరిన ఓటర్లలో అత్యధికులు తూర్పు చంపారణ్, పశ్చిమ చంపారణ్, మధుబని, కిషన్‌గంజ్, పూర్ణియా, కతిహార్, అరారియా సుపాల్ జిల్లాలకు చెందినవారున్నారు. ఈసీఐ భారీ సంఖ్యలో ఓటర్లకు



నోటీసులు జారీ చేసిన దరిమిలా, బీజేపీ దీనిపై స్పందిస్తూ, ఈ ప్రాంతం బంగ్లాదేశీయులు, రోహింగ్యాల అక్రమ వలసలకు కేంద్రంగా ఉందని ఆరోపించింది. కాగా ఎన్నికల జాబితాపై కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై వివిధ రాజకీయ పార్టీలు అభ్యంతరాలను వ్యక్తం చేశాయి.

# అమెరికాలో మాదిరిగా 'సరిహద్దు గోడ' కావాలా?

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో అక్రమ వలసదారులను అడ్డుకునేందుకు అమెరికాలో మాదిరిగా సరిహద్దు గోడ కట్టాలనుకుంటున్నారా? అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. జాతీయ భద్రత, దేశ సమగ్రతకు సంబంధించిన అంశాలు ఇమిడి ఉన్నప్పటికీ.. భారతీయులు పొరుగు దేశాలతో భాషా, సాంస్కృతిక వారసత్వాన్ని పంచుకుంటున్నారన్నారని పేర్కొంది. సరిహద్దుల ద్వారా వేరుగా ఉన్నా.. ఒకే భాష మాట్లాడుతున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అభిప్రాయపడింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏంటనే విషయాన్ని తెలియజేయాలన్నది. వలసదారులను అక్రమంగా నిర్బంధించి పంపించి వేస్తున్నారన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలీల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా బెంగాలీ మాట్లాడే వారిని తీసుకెళ్లి బలవంతంగా బంగ్లాదేశ్‌కు పంపిస్తున్నారని పిటిషన్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. జాతీయత నిర్ధరణ అయ్యే వరకూ పంపించకుండా వలసదారులకు ఉపశమనం కలిగించాలని కోరారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. బెంగాలీ మాట్లాడే వలసదారులను బంగ్లాదేశ్ పౌరులుగా అనుమానిస్తూ నిర్బంధిస్తున్నారని ఆరోపిస్తూ పశ్చిమ బెంగాల్ వెల్ఫేర్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధిత పార్టీలు ఎవరూ కోర్టు ముందు హాజరు కాలేదన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. వనరుల కొరత కారణంగా వాళ్లు న్యాయస్థానానికి రాకపోయి ఉండవచ్చని అభిప్రాయపడింది.



న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ను ఉద్దేశిస్తూ మాట్లాడిన మెహతా.. అమెరికా వ్యక్తులకు సాయం చేయడంతోపాటు కోర్టును ఆశ్రయించడంలో వారికి ఇటువంటి ప్రజాస్ఫూర్తి కలిగిన వ్యక్తులు తప్పకుండా సాయం చేయాలని అన్నారు. ఇందుకు జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ.. భారత్‌లోకి అక్రమ వలసదారులు ప్రవేశించకుండా అడ్డుకోవాలంటే అమెరికాలో మాదిరిగా సరిహద్దు గోడ కట్టాలనుకుంటున్నారా? అని సొలిసిటర్ జనరల్‌ను ప్రశ్నించారు. దీనికి మెహతా బదులిస్తూ.. అటువంటిదేమీ లేదన్నారు. అయితే, పిటిషనర్ ఆరోపిస్తున్నప్పటికీ.. వీటికి సంబంధించి కచ్చితమైన ఫిర్యాదులేమీ లేవని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ భద్రత, దేశ సమగ్రతకు సంబంధించిన అంశాలు ఇందులో ఇమిడి ఉన్నప్పటికీ.. బెంగాలీ, పంజాబీ భాషలు మాట్లాడే భారతీయులు పొరుగుదేశాలతో భాషా, సాంస్కృతిక వారసత్వాన్ని పంచుకుంటున్నారని, సరిహద్దుల ద్వారా వేరుగా ఉన్నా, ఒకే భాష మాట్లాడుతున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయడంతోపాటు, వీరిని వెనక్కి పంపించేందుకు అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ విధానాలు ఏంటనే విషయాన్ని తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసులో గుజరాత్ ప్రభుత్వాన్ని కూడా పార్టీగా చేర్చుతున్నట్లు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది.

## రాహుల్ సభపై దుమారం



**న్యూఢిల్లీ**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న బిహార్ దర్భంగా ఓటర్ అధికార్ యాత్ర సభ వేదికపై నుంచి ప్రధాని మోదీ తల్లిని కొందరు దూషించడంపై కలకలం రేగుతోంది. మోదీ మాతృమూర్తిని హిందీలో దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఘటన నేపథ్యంలో రాహుల్‌పై బిహార్ బీజేపీ నేత కృష్ణ సింగ్ ఫిర్యాదుతో పట్నాలో కేసు నమోదు చేశారు. బీజేపీ దర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆదిత్య నారాయణ్ ఇచ్చిన మరో ఫిర్యాదుతో పోలీసులు దర్భంగాలోని సింఘ్వారా ప్రాంతానికి చెందిన మహ్మద్ రిజ్వీ అనే 20 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. వేదికపైనుంచి మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిలో రిజ్వీ కూడా ఉన్నారని బీజేపీ నేతలు కేసు పెట్టారు. మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పాట్నాలో బీజేపీ–కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు విసరగా, బీజేపీ కార్యకర్తలు పార్టీ జెండా కర్రలు విసిరారు. దీంతో సదాఖత్ ఆశ్రమ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. మోదీ తల్లిపై దూషణ నేపథ్యంలో రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ రాజకీయాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయని షా వ్యాఖ్యానించారు. మోదీ తల్లి పేదరికంలో నుంచి వచ్చినా విలువలు నేర్పారని, అందువల్లే మోదీ ప్రధాని స్థాయికి చేరుకున్నారని షా చెప్పారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండటాన్ని కాంగ్రెస్ జీర్ణం చేసుకోలేకపోతోందన్నారు. మోదీ తల్లిని దూషిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఉపయోగించిన భాష అసభ్యకరంగా ఉందని బిహార్ సీఎం నితీశ్ ఖండించారు. కాగా, ఓటర్ అధికార్ యాత్ర నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని జైరాం రమేశ్ అన్నారు.

## 1991 లోక్‌సభ ఎన్నికల్లో నన్ను మోసపూరితంగా ఓడించారు

**బెంగళూరు**

కొప్పళ లోక్‌సభ స్థానం నుంచి 1991లో తాను జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తనను మోసపూరితంగా ఓడించారని కర్ణాటక సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో తనపై కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్ పాటిల్ అన్వరి గెలిచారని, 11,200 కంటే తక్కువ ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని తెలిపారు. అయితే కౌంటింగ్‌లో 22,243 ఓట్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారని, అదే తన ఓటమికి కారణమని, ఆ ఓట్లను లెక్కించి ఉంటే తాను గెలిచేవాడినని వివరించారు. మాజీ అడ్వకేట్ జనరల్ ప్రొఫెసర్ రవివర్మ కుమార్ న్యాయవాద వృత్తిని చేపట్టి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా విధానసౌధలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిద్దరామయ్య నాటి ఎన్నికల గురించి ప్రస్తావించారు. ఆ సమయంలో రవివర్మ తనకు సాయం చేశారని గుర్తుచేసుకున్నారు. అయితే, ఓట్ల చౌర్యంపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్న తరుణంలోనే సిద్దరామయ్య..అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్‌పాటిల్ తనపై మోసపూరితంగా గెలిచారని చెప్పడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ మోసం చేసి గెలిచినట్లు సిద్దరామయ్యే స్వయంగా ప్రకటించారని బీజేపీ విమర్శించింది.

## భారత్‌లో సీఎన్‌జీ నెట్‌వర్క్ విస్తరిస్తోంది

## 2030 నాటికి భారత్‌లో 18వేల సీఎన్‌జీ స్టేషన్లు



క్లీన్ ఎనర్జీ కింద భారత్‌లో 2030 నాటికి సీఎన్‌జీ స్టేషన్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని.. దాంతో మొత్తం 18వేలకు చేరుతాయని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ వెల్లడించారు. సోషల్ మీడియా పోస్ట్‌లో వన్ నేషన్, వన్ గ్యాస్ గ్రిడ్ పథకం కింద సాధించిన విజయాలను హైలైట్ చేశారు. 2014లో దేశంలో కేవలం 738 సీఎన్‌జీ స్టేషన్లు మాత్రమే ఉన్నాయని.. ఈ సంఖ్య నేడు 8,150కి పెరిగిందన్నారు. బస్సులు, ఆటోలు, కార్లకు సరసమైన, స్వచ్ఛమైన ఇంధనంతో శక్తిని అందిస్తోంది. 2030 నాటికి ఈ నెట్‌వర్క్ 18వేలకుపైగా స్టేషన్లకు విస్తరిస్తుందన్నారు. గత దశాబ్దంలో పట్టణ గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్ అపూర్వమైన విస్తరణను చూసిందని మంత్రి పేర్కొన్నారు. 2014లో కేవలం 55 భౌగోళిక ప్రాంతాలకే పరిమితమైన నెట్‌వర్క్ ఇప్పుడు 307 ప్రాంతాలకు విస్తరించిందని.. ఇది దాదాపు మొత్తం దేశాన్ని కవర్ చేస్తుందన్నారు. జనాభాలో 99 శాతం, భూభాగంలో 96 శాతానికి చేరుకుందన్నారు. ప్రస్తుతం 1.52 కోట్ల గృహాలు పైప్డ్ సహజ వాయువు (%ూచీ+%)తో అనుసంధానమయ్యాయని.. దాంతో వంటశాలలు సురక్షితంగా, శుభ్రంగా ఉంటాయన్నారు. ఈ వ్యవస్థకు గ్యాస్ పైప్‌లైన్ నెట్‌వర్క్ వెన్నెముకలాంటిదని పేర్కొన్నారు. ప్రస్తుతం పైప్‌లైన్‌లు 25,429 కిలోమీటర్ల విస్తరించాయని.. నిర్మాణ పనులు కొనసాగుతున్నందున 2030 నాటికి 33,475 కిలోమీటర్లకు విస్తరిస్తాయని భావిస్తున్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ వ్యవస్థ తీరప్రాంతాల నుంచి మారుమూల పట్టణాలకు నిరంతరాయంగా ఇంధన సరఫరా చేయడాన్ని నిర్ధారిస్తుంది. దేశం కూడా గ్రీన్ ఇంధనం వైపు కదులుతోందని కేంద్రమంత్రి పూరీ చెప్పారు. ఇప్పటివరకు 113 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ప్రారంభమయ్యాయని.. మరో 78 ప్లాంట్లు పైప్‌లైన్‌లో ఉన్నాయన్నారు. గత సంవత్సరం దాదాపు 42,800 టన్నుల సీబీజీని సేకరించారని.. ఈ సంవత్సరం బ్లెండింగ్ లక్ష్యాన్ని ఒకశాతంగా నిర్ణయించారు. దీనిని 2028 నాటికి 5 శాతానికి పెంచనున్నారు. ప్రభుత్వ డేటా ప్రకారం.. జూన్ 2025 నాటికి భారతదేశ మొత్తం స్థాపిత సామర్థ్యం 476 గిగావాట్లకు చేరుకుంది. ఇందులో 240 గిగావాట్లు థర్మల్ విద్యుత్ నుంచి వస్తాయి. ఇది మొత్తం ఉత్పత్తిలో 50.52 శాతం. శిలాజేతర ఇంధన వనరులు 235.7 గిగావాట్లు. మొత్తం సామర్థ్యంలో 49 శాతం దోహదం చేస్తాయి. ఇందులో 226.9 %+ఔ% పునరుత్పాదక శక్తి, 8.8 %+ఔ% అణుశక్తి ఉండగా.. గ్యాస్ ఆధారిత విద్యుత్ మొత్తం సామర్థ్యంలో 20 %+ఔ% దోహదపడుతుంది. గత పదకొండు సంవత్సరాలలో భారతదేశం పునరుత్పాదక ఇంధన రంగంలో గణనీయమైన పురోగతి సాధించింది. %జ్యూ%26 నిబద్ధతకు అనుగుణంగా 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల నుంచి 500 %+ఔ% స్థాపిత సామర్థ్యాన్ని సాధించడానికి ఇంధన మంత్రిత్వ శాఖ కృషి చేస్తున్నది.

# స్కూల్ యాజమాన్యాలతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సమన్వయ సమావేశం....

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** స్కూల్ ట్రాన్స్ పోర్టేషన్ కు సంబంధించిన ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో మాదాపూర్ జోన్ పరిధిలోని స్కూల్లో యాజమాన్యాలతో సైబరాబాద్ జాయింట్ సిపి ట్రాఫిక్ డా. గజారావు భూపాల్, ఐ.పి.ఎస్., ఇతర ట్రాఫిక్ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చర్చించిన ముఖ్య అంశాలు:స్కూల్ వాహనాలను ఎక్కువ మంది విద్యార్థులు వినియోగించేలా స్కూళ్ల యాజమాన్యాలు ప్రోత్సహించాలి. ప్రైవేట్ కార్ల వినియోగం తగ్గించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. రద్దీ ఎక్కువ గా వుండే సమయాల్లో స్కూల్ పక్కన, -టర్న్ తీసుకునే ప్రాంతాల్లో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉంది. తదనుగుణంగా స్కూల్ ట్రాన్స్ పోర్టేషన్ వాహనాలకు ప్రణాళిక వేసుకోవాలి. ముఖ్యంగా ఒకే మార్గంలో ఎక్కువ స్కూల్ వాహనాల రద్దీ పెరగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. తల్లిదండ్రులు ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గిస్తే, స్కూల్ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గే అవకాశం ఉంది అన్నారు. స్కూల్ సమయాల వేళలో వ్యత్యాసం



పాటించడం వలన రోడ్లపై వాహనాల రద్దీని తగ్గించవచ్చు. స్కూల్ యాజమాన్యాలు కార్ పోలింగ్ పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా వాహనాల రద్దీని తగ్గించే అవకాశం ఉంది. బస్సు డ్రైవర్లకు నిరంతరం ఆల్కహాల్ పరీక్షలు నిర్వాహించాలి. తద్వారా విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణం కల్పించవచ్చు. స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రయాణ మార్గాలు, మార్గదర్శకాలు సూచించాలి. పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ట్రాఫిక్ పోలీసులు కలిసి సమర్థవంతమైన, సురక్షిత ట్రాఫిక్ నిర్వహణలో భాగస్వామ్యం అవ్వాలి అన్ని అన్నారు. ఈ సమావేశంలో మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్,




మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ సీ ఎస్ సీ సీఈఓ నావేద్ ఖాన్, శాంతా మరియా ఇంటర్నేషనల్ స్కూల్, ఫినిక్స్ గ్రీన్స్ ఇంటర్నేషనల్ స్కూల్, గ్లోబల్ ఎడ్జ్ స్కూల్ నార్సింగి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నానక్ రామ్ గూడ, చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ మజీద్ బండ, మెరీడియన్ స్కూల్ మాదాపూర్, ఓక్ రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ నానక్ రామ్ గూడ, ఎన్ ఏ ఎస్ ఆర్ స్కూల్ గచ్చిబౌలి, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్, బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్, తదితర స్కూల్ యాజమాన్యాలు పాల్గొన్నారు.

## చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన విశ్వభారతి స్కూల్



**మద్దూర్ ఆగస్టు 29 ప్రభాతవార్త** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో నిర్వహించిన చెస్ పోటీల్లో విశ్వభారతి స్కూల్ కు చెందిన విద్యార్థి అరవింద్ ప్రథమ బహుమతి 2000 రూపాయలు, అదే స్కూల్ కు చెందిన విద్యార్థి మహేష్ ద్వితీయ బహుమతి 1500 రూపాయలు గెలుచుకోవడం జరిగిందని భగత్సింగ్ యూత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి స్కూల్ ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, కార్యనిర్వహకులు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

## వైకుంఠ రథం బహుకరణ




**గట్టుప్పల్, ప్రభాతసూర్య ఆగస్టు 29 :**నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం తెరట్పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వీరమల్ల శ్రీశైలం గౌడ్, తన తాత వీరమల్ల దేగయ్య, నాయనమ్మలు పాపమ్మ, సత్తమ్మల జ్ఞాపకార్థం శుక్రవారం గ్రామానికి వైకుంఠ రథాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాజీ సర్పంచ్‌కీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరమల్ల యాదయ్య, యాదమ్మ, గ్రామపంచాయతీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు వాకిలి ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం



**నల్గొండ ఆగస్టు 29 ప్రభాత సూర్య** నల్గొండ పట్టణ శివాజీ నగర్ లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్ అండ్ బి శాఖ మాత్యులు శుక్రవారం బంగారు వాకిలి ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించి మాట్లాడారు నమ్మకం నాణ్యతకు మారుపేరు బంగారు వాకిలి ఫ్యామిలీ రెస్టారెంట్ అని రుచికరమైన శాఖాహారం మరియు మాంసాహారం వివిధ రకాల వంటకాలు అందుబాటులో ఉంటాయని అవుట్ డోర్, డోర్ డెలివరీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, రెస్టారెంట్ ఎండి పున్నం నాగరాజ్, పగిళ్ల సైదులు, నర్సింగ్ కృష్ణయ్య, శ్రీనివాస్ గౌడ్, మరియు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

**చౌటుప్పల్. ఆగస్టు 29. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండల పరిధిలోని ఎస్ లింగోటం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం " జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ " వారి సౌజన్యంతో బాల్య వివాహాలు లేని భారతదేశం కోసం స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో" బాలల హక్కుల పరిరక్షణ" లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలు నిర్మూలన కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్కోప్ మండల కోఆర్డినేటర్ బి నరసింహ రాజు మాట్లాడుతూ... విద్యార్థులను ఎవరైనా వేధించిన, బాల్య వివాహాలు చేసినట్లయితే 1098, 100/112 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని, స్థానిక అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్స్, తాసిల్దార్, విలేజి చేరవేయాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ పురుషోత్తం రెడ్డి




మాట్లాడుతూ... బడి, ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, బాల వివాహాలు నిర్మలనకు ప్రతిజ్ఞ చేయించడంతోపాటు అవగాహన కల్పించిన స్కోప్ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి కాజా షరీఫ్, కే సోని, కే విజయ, ఎండీ నజీమున్నిసా, తిరుమల బ్రహ్మచారి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం సందర్శించిన ఎన్ శోభారాణి




**చౌటుప్పల్.ఆగస్టు 29. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంను శుక్రవారం ఆకస్మిక తనిఖీల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిని ఎన్ శోభ రాణి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. పంచాయత్ సెక్రటరీ, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పనుల జాతర, ఇంకుడు గుంతలు , ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో కలిసి సమీక్ష చేసి పలు విధములైన ఆదేశాలను జారీ చేసినారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సందీప్ కుమార్, ఎంపీ ఓ వి అంజిరెడ్డి, ఏపీవో ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న సేవా పురస్కార ప్రదానోత్సవం



**హైదరాబాద్, ప్రభాతసూర్య ఆగస్టు 29 :** హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎనిమిదవ ఆవిర్భావ వేడుకలు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షులు జక్కె వీరస్వామి గౌడ్, సోమన్న గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు వి. శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవా పురస్కారాలకు ఎంపికైన మర్రిగూడ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంతరాజు గౌడ్ గారిని శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

## టీచర్ యాదయ్య సహకారంతో విద్యార్థులకు మెరుగైన విద్య.

**తల్లితండ్రుల జ్ఞాపకార్థం డిజిటల్ విద్యకు ప్రోత్సాహం.**
**విద్యనేర్పిన పాఠశాల ఋణం తీర్చుకుంటున్న దంపతులు.**
**దళిత కుటుంబంలో పుట్టి..ఎన్నో సేవలకు ముందడుగు..**
**కృతజ్ఞతలు తెలిపిన పిల్లల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు.**



**నల్లగొండ(ప్రభాత సూర్య):-** తాను పుట్టిపెరిగిన గ్రామంలో, విద్యను నేర్పి, ఉన్నత స్థానంలో నిలిపిన పాఠశాలకు, గురువుల ఋణం తీర్చుకునే కార్యక్రమాలు చేస్తున్నారు, రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోరెంక యాదయ్య... కోరెంక అనేది ఆయన ఇంటి పేరైనప్పటికి, ఉన్నత చదువులు ఆయనను సమాజంలో టీచర్ యాదయ్యగా నిలబెట్టింది. పుట్టింది పేద కుటుంబంలో అయినా..ఆయన పట్టుదల ప్రభుత్వ ఉద్యోగం సాధించడంలో తోడ్పాటయింది. విద్యకు పేద, కుల, మత, వర్గబేధాలు లేవని ఈయనను చూస్తే నిజమనిపిస్తుంది. రాంరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, చిన్నప్పటి నుండే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని ఆయన పూనుకున్నారు. అనుకున్నదే తడవుగా, ఆయన కుమారుల సహకారంతో, ఏఎల్ఎక్స్ ప్రోగ్రాం ప్రారంభించేందుకు ముందుకు వచ్చారు. వాటికోసం అయ్యే ఖర్చును మొత్తాన్ని భరించేందుకు సిద్ధపడ్డారు. వెంటనే తన తల్లితండ్రుల పేరున కంప్యూటర్లు ఇప్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు. ౹- ఎవరీ టీచర్ యాదయ్య. నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం, రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోరెంక నర్సింహ ఎల్లమ్మలకు యాదయ్య జన్మించాడు. మొదటి నుండే వీరిది పేద కుటుంబ కావడంతో, ఈయనతో పాటు అక్క రాములమ్మ, తమ్ముడు చిన్న యాదయ్యల పోషణ ఆ కుటుంబానికి మరింత భారంగా మారింది. ఒక పూరి గుడిసెలో నివాసం ఉంటూ, ఆయన తల్లిదండ్రులు కూలి పనులు చేసుకునేవారు. పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు కోరిక ఉన్నప్పటికీ, పేదరికం వారిని వెక్కిరించింది. బ్రతుకు బండి నడవాలంటే, ఏదో ఒక పని చేసుకోవాలని.. అదే గ్రామానికి చెందిన పెద్ద వెంకట్ రావు బర్లకాడి జీతగాడిలా మారాడు టీచర్ యాదయ్య. యజమాని చేతిలో దెబ్బలు తిన్న ఆయన జీవితం, విద్యవైపు నడిపించింది. స్కూల్ కు వెళ్ళడానికి బట్టలు లేని సమయంలో, తండ్రి అప్పు చేసి మరి బట్టలు తీసుకున్న రోజులు టీచర్ యాదయ్య మరిచిపోలేదు.రెండో తరగతి రాంరెడ్డిపల్లిలో, ఐదవ తరగతి తానేదార్పల్లిలో చదువుకున్నాడు. ఆదివారం సెలవుల సమయంలో భీమనపల్లిలో మిరప కోయడానికి, గొర్లకాపరిగా మారి, ఎనమిదవ తరగతి వరకు చదువు పూర్తి చేసాడు. ఇదిలా ఉండగా ఏడవ తరగతిలో, తండ్రి మరణం తీరని దుఃఖాన్ని మిగిల్చడమే కాక, విద్యాభ్యాసం అంధకారంగా మారింది. ఎటు వెళ్లలేని సమయంలో చదువుపై ఆయన ఆసక్తి, సరస్వతి వైపు నడిపించింది. ౹ బట్టపోతు నరసమ్మ రామలచ్చయ్యల తోడ్పాటు. టీచర్ యాదయ్య పెద్దనాన్న కూతురు, బట్టపోతు నరసమ్మ రామలచ్చయ్యలు, ఆపై చదువులకు తోడ్పాటును అందించారు. వారి సొంత గ్రామమైన వెల్మకన్నెకు తీసుకొని వెల్లిన ఆ దంపతులు, వెల్మకన్నె హాస్టల్ లో చేరిపించారు. ఆదివారం వారివద్దే ఉంటూ, వ్యవసాయ పనులు చేసుకుంటూ వారికి సహాయంగా ఉండేవారు టీచర్ యాదయ్య. రుచి లేని, పురుగు పట్టిన అన్నంతో పస్తులు ఉన్న రోజులను, యాదయ్య ఇప్పటికి మరువలేదు. తగిన పోషణ లేక ఆరోగ్యం దెబ్బతినడం సవాళ్ళుగా మారిన రోజుల్లో చదువుకోవాలన్న తపన ఆయనను ఎన్నో కష్టాలను ఎదురుకునే శక్తిని అందించింది. 1987లో ద్వితీయ శ్రేణిలో పదవ తరగతి పూర్తి చేసి, ఇంటర్ చదువులకై, నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. అక్కడ కూడా కష్టాలు వెంటే వచ్చాయి. రూమ్ కిరాయిలు, తిండి, బట్ట, ఫీజులు, పుస్తకాల కోసమై కూలిగా మారిన రోజులు నెమరేసుకుంటున్నారు యాదయ్య. కిరాణం షాపుల్లో, హోటల్స్, లాడ్జీలు, ఉప్పరి పనులు చదువుకై వారు చేసిన పనులు పోరాటమనే చెప్పుకోవాలి. ౹- కన్నతల్లి ఎల్లమ్మ దీవెనతోనే ఉన్నత చదువులు తండ్రి లేని యాదయ్యకు తల్లి ఎల్లమ్మనే అంతాతానై చూసుకుంది. దొరల దగ్గర జీతం ఉన్న ఎల్లమ్మ, దొరికిన ప్రతి గింజ, వచ్చిన ప్రతి రూపాయి ఆయన చదుకై వెచ్చించింది. ప్రతి సారి కన్నీళ్లతో కొడుకును సాగనంపే తల్లిపడిన కష్టానికి ఋణం తీర్చుకోవాలని, చదువుపై కసి పెంచుకొని చదవసాగాడు. ఈ సమయంలో ఉపాధ్యాయులు, లెక్చలర్లు ఫీజులు కట్టి ప్రోత్సహించారు. తెలుగు పండిత శిక్షణ పూర్తి చెయ్యడానికి తన వద్ద డబ్బులు లేకపోవడంతో, ఆయన క్లాస్మెట్ అరుణ భారతి ఆర్థిక భరోసాను అందించారు. తనకు ఆయన ఎప్పటికి ఋణపడి ఉంటారనేది చిన్నమాటే. డిగ్రీలో ప్రథమ శ్రేణిలో ఆయన పట్టా పొంది ప్రథమ మెట్టును అధిరోహించారు. 1996లో ఆయన కళ సాకారం. పీజీ ఎంట్రెన్స్ లో ఉస్మానియా పరిధిలో మొదటి ర్యాంక్ సాధించిన ఆయన, పీజిని కొనసాగిస్తూనే ఉపాధ్యాయ పరీక్షలకు హాజరయ్యేవారు. ఆయన పట్టుదల ముందు, ఆశయం తలదించుకుంది. 1996 జులై 18న ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాదించాడు. తాను ఎక్కివచ్చిన పేదరికం మెట్లను, అనుభవాలుగా పేర్చుకొని టీచర్ యాదయ్యగా మారాడు. అప్పటి నుండి ఏదో ఒక రకంగా, తన వద్ద చదువుతున్న విద్యార్థులకు తోచిన సహాయం చేస్తూ, అందరికి సేవలు అందిస్తునే ఉన్నాడు. ౹- ఆయన బాటలోనే కుటుంబం టీచర్ యాదయ్య బాటలోనే ఆయన కుటుంబ సభ్యులు నడుస్తున్నారు.. సతీమణి పద్మావతి కూడా ఉపాధ్యాయురాలే.. భర్త యాదయ్యను అనుసరిస్తూ, అందిస్తున్న సహకారాలలో వెన్నంటే ఉన్నారు. పెద్ద కుమారుడు రోహిత్ వర్మ, బెంగుళూరులో కోలికం కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సిద్దార్థవర్మ ఆస్ట్రేలియాలో, ఎమ్మెస్సి ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.. కడుపున పుట్టిన పిల్లలు కూడా ఆయన మార్గంలోనే నడుస్తూ, సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా కోరెంక యాదయ్య మాట్లాడుతూ, మనకు అది లేదు ఇది లేదు అని వెనకడుగు వెయ్యకుండా, పట్టుదలతో పని చేస్తూ, ఏకగ్రతతో సాధిస్తే సాధ్యం కానిది ఏమి లేదని సూచించారు. నేటి యువత చెడు వ్యాసనాలకు బానిస కాకుండా, కన్నతల్లితండ్రులకు, పుట్టిన ఊరికి పేరు తెస్తూ, అందరికి ఆదర్శంగా ఉండాలని సూచించారు.

## శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో

**తెలుగు భాష దినోత్సవ మరియు స్పోర్ట్స్ డే వేడుకలు...**




కొండాపూర్ ప్రభాత సూర్య : కొండాపూర్ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీ "బి. బ్లాకు లో లేనిదే స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్ లో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధా మాట్లాడుతూ . గురజాడ గుర్రం జాషువా. శ్రీ శ్రీ దాశరధి కృష్ణమా చార్య, రంగాచార్య. సినారె. కృష్ణ దేవారాయాలు. బ్రాహ్మణ పోతన్న వంటి కవులను సాహితీ పోషకులు. భాష పరిశోధకుల చిత్రపటాలు ప్రదర్శించి వారి గురించి తెలియజేయడం జరిగింది అని అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు గ్రాంధికములో ఉన్న సాహిత్యాన్ని ప్రజల వాడక భాషలోకి తీసుకొచ్చారని తెలుగు భాష కోసం 30 సంవత్సరాల ఉద్యమం చేశారని దేశభాషలందు తెలుగు లెస్స . తేనె కన్నా తీయనిది తెలుగు భాష అని శ్రీకృష్ణదేవరాయలు మెచ్చుకున్నారని అమ్మ నేర్పిన భాష అమ్మలాంటి తెలుగు భాషను ఎవరు మరువకూడదని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులతో స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు పిల్లల ఎదుగుదలకు ఆటలు ఎంతో ఉపయోగపడుతుందని చదువుతోపాటు పిల్లలకు ఆటలు ఎంతో అవసరమని మానసికంగా శరీరకంగా కలిగే లాభాల గురించి తెలిపారు, కార్యక్రమంలో అధ్యాపకులు. పి టి సురేందర్. విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

**జాతీయ క్రీడ దినోత్సవం వేడుకలు...**




**చందా నగర్ ప్రభాత సూర్య :** జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిజెఆర్ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి క్రీడదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాకీ మాంత్రికుడు మేజర్ ద్యాన్ చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు క్రీడల వైపు అసక్తి కనబరచాలని , తద్వారా జీవితంలో అన్ని ఆధ్యక్షుడు , హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు . కార్యక్రమంలో భాగంగా పలు క్రీడల కోచ్ లను ప్రత్యేకంగా హోప్ ఫౌండేషన్ ద్వారా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు డగ్లస్ , రవీందర్ , వెంకటేశ్ , నవీన్ , మహేశ్, సురేశ్ , శ్వేత తదితరులు పాల్గొన్నారు .


## బాలుర వసతి గృహము సందర్శించిన మున్సిపల్ కమిషనర్



**చౌటుప్పల్. ఆగస్టు 29. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వి హనుమంతరావు ఆదేశాల మేరకు పాఠశాలల వసతి గృహంలో అధికారుల నిద్రలో భాగంగా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులముల బాలుర వసతి గృహాన్ని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి శుక్రవారం సందర్శించారు. హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న పలు వసతులను అడిగి తెలుసుకున్నారు. వంటగది, స్టోర్ రూమ్, మంచినీటి వసతిని, విద్యార్థుల హాజరు రికార్డును, విద్యార్థులు పడుకుంటున్న గదులను, మరుగుదొడ్లను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారితో కలిసి భోజనం చేశారు. గతంలో హాస్టల్ నీ సందర్శించిన సందర్భంలో ఉన్నపటికీ ఇప్పటికీ మెరుగుదల ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. స్టోర్ రూమ్, భోజన శాల గది, పిల్లలు పడుకునే గదులు పరిశుభ్రంగా ఉండటం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకి వారి బాధ్యతను గుర్తు చేస్తూ, భవిష్యత్తు పై అవగాహన కల్పించారు. పిల్లలు అనారోగ్యంకి గురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి తెలియజేశారు.

# యూరియా అందించే బాధ్యత కేంద్రానిదే

**యూరియా కొరత లేకుండా తక్షణం రాష్ట్ర కోటాను విడుదల చేయాలి. బుర్ర శేఖర్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు.**



**మర్రిగూడ ఆగస్టు 29,(ప్రభాత సూర్య)** శుక్రవారం రోజున మర్రిగూడ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా చేసి తాసిల్దార్ గారికి మేమోరండం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు ఆ వలమిస్తున్నాయని వ్యవసాయ రంగంపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు రైతులకు అడుగు మందు యూరియా అత్యంత అవసరమని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండిద్దామన్న పంటకు సరైన ఎరువులు యూరియా అందుబాటులో లేనందున రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం త్వరగా తీసుకుని వ్యవసాయ పరపతి సంఘాలతో రైతులకు సరిపడా అడుగుమందు యూరియాలను నిల్వ ఉంచాలని ప్రతి రైతుకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. మరోవైపు అధికారుల వైఫల్యం కారణంగా ప్రైవేటు వ్యక్తులు తక్కువ ధరకు ఉన్న యూరియాను బ్లాక్ మార్కెట్ తరలించి అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. రైతులు గత్యంతరం లేక ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సిన అవసరం పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అడుగు మందులు నిల్వ ఉంచి రైతులకు సబ్సిడీ మీద ఎరువులు అందించాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల భిక్షం రెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కల అంజయ్య అధ్యక్షులు జిట్టా బాలకృష్ణ అబ్బన గోని కృష్ణయ్య కర్నాటి అంజయ్య నజీర్ కొట్టం యాదయ్య మాధగోని నరసింహ తదితరులు పాల్గొన్నారు

# సాయి మంచికంటి,మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ చౌటుప్పల్ యశోద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

**సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 29( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వావిల్లపల్లి గ్రామంలో సాయి మంచికంటి మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ చౌటుప్పల్ యశోద హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ మంచికంటి వెంకటేష్, డాక్టర్ మంచికంటి రాజేశ్వరి యశోద హాస్పిటల్ హైదరాబాద్ డాక్టర్లు పాల్గొని సుమారు రెండు వందల మందికి డెంటల్ పరీక్షలు, బీపీ, ఈసీజీ, షుగర్ వంటి ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది. ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ వైద్యులు ఒక్కొక్కరికి ప్రత్యేక సలహాలు అందించారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని




నిర్వహించిన మంచికంటి భాస్కర్ కి సాయి మంచికంటి యశోద హాస్పిటల్ వైద్యులకు గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,




తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

**తక్షణమే మండల వ్యాప్త సమస్యలను పరిష్కరించాలి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా**

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 29( ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో, పట్టణంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జూలూరు రుద్రవెల్లి మధ్యన మూసి కాలువపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణము పూర్తిచేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. శుక్రవారం పోచంపల్లి మండలం, పట్టణంలో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం వివిధ సమస్యలపైన తహాశీల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహపాల్గొని మాట్లాడుతూ మండల పరిధిలోని శివరెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన బొక్క వెంకటరెడ్డి అనే వ్యక్తి గ్రామపంచాయతీ కార్యదర్శి సహకారంతో ఆ స్థలాన్ని తన ఇంటి నెంబరు వేసి రసీదు రాసి ఇవ్వడంతో అట్టి రసీదు సహాయంతో అట్టి గ్రామపంచాయతీ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆ విషయం పైన సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శి తప్పుడు రసీదు ఇవ్వడం జరిగిందని అతనిపై చర్యలు తీసుకొని బదిలీ చేశారు కానీ తిరిగి పట్టి స్థలాన్ని గ్రామపంచాయతీ పరిధిలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అక్రమంగా కబ్జా చేసుకుని రిజిస్టర్ చేసుకున్న స్థలాన్ని రిజిస్టర్ రద్దు చేయించి ఆ స్థలాన్ని యధావిధిగా గ్రామపంచాయతీకి తీసుకునే విధంగా చర్యలు



తీసుకునేది పోయి స్థానిక మండల అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అదేవిధంగా పోచంపల్లి నుండి జిల్లా కేంద్రానికి వెళ్లే దారి రేణుపల్లి నుండి పెద్ద రావులపల్లి వరకు గుంతలు పడి చెరువులను తలపిస్తున్నాయని అనేకమంది ప్రయాణికులు ఆ రోడ్డు వెంబడి వెళ్లి ప్రమాదాల గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి డబల్ రోడ్డు వెయ్యాలని సూచించారు. మండల వ్యాప్తంగా గ్రామాలలో రోడ్లన్ని వర్షాలకు దెబ్బతిన్నాయని వాటిని బాగుచేయాలని చేపట్టగా స్థానిక ఎమ్మెల్యే హడావిడిగా రోడ్లను శంకుస్థాపన చేసి వదిలేసారని అట్టి రోడ్లను వెంటనే వేయాలని అన్నారు. జలాల్ పూర్ చెరువు కట్టమీద ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని అధికారులు మాత్రం పట్టించుకోకుండ ప్రమాదాలు జరిగినప్పుడే బడ్జెట్ కేటాయిస్తూ పనులు మాత్రం చేయకుండా గాలికి వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జలాల్ పూర్ చెరువు కట్టపైన గోడ నిర్మాణం చేయాలని అన్నారు. పోచంపల్లి పట్టణంలో



ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా మార్చి 24 గంటల వైద్యం అందించాలని, పోచంపల్లి మండలం జూబ్లక్ పల్లి, పట్టణంలో నిర్మాణం పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు వెంటనే పంపిణీ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు మలు చేయాలని కోరారు. మండల వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని నర్సింహా డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ సిపిఎం సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి పాల్గొని మాట్లాడగా ఈ కార్యక్రమంలో సిపిఎం మండల మాజీ కార్యదర్శులు పగిళ్ల లింగారెడ్డి, ప్రసాదం విష్ణు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, పట్టణ, మండల కమిటీ సభ్యులు వడ్డేపల్లి యాదగిరి, బుగ్గ లక్ష్మయ్య, పోన్నమోని కృష్ణ, నెలకంటి జంగయ్య, నోముల కృష్ణారెడ్డి, పత్తి బిక్షపతి, సామ జంగారెడ్డి, నాయకులు వరాల మల్లారెడ్డి, కాగు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలపై ఎంపీడీవో కు బీజేపీ వినతి

**గట్టుప్పల్, ప్రభాతసూర్య ఆగస్టు 29 :** గట్టుప్పల మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు మండల అధ్యక్షులు రావుల యల్లప్ప నేతృత్వంలో ఎంపీడీఓ, ఎంఆర్ఓలకు వినతిపత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ, మండల కేంద్రం నుండి గ్రామాలకు లింక్ రోడ్లను వేయాలని, వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను తక్షణమే బాగు చేయాలని కోరారు. పారిశు ధ్యం లోపించడం వల్ల దోమల బెడద ఎక్కువై ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశముందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామాల్లో వీధి కుక్కల సమస్య పరిష్కారం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బీజేపీ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ ఉపాధ్యక్షులు కంపే దుర్గయ్య, ఉపాధ్యక్షులు జంపాల సుధాకర్, ఏలే మారయ్య, ప్రధాన కార్యదర్శులు ఇడం రాజు, నాగులగాని శ్రీనివాసులు, రాపోలు మార్కండేయ, పగిళ్ల శ్రీను, కుందే శ్రీశైలం, కార్యదర్శి మదగాని బిక్షం, ఎంగిలి ప్రవీణ్, మాదగాని రాజు, బొట్ట సైదులు, బోయపల్లి లోగి గౌడ్



తదితరులు పాల్గొన్నారు.

# సాయి మంచికంటి హాస్పిటల్ వారి సేవలు మరువలేనివి

**కాంగ్రెస్ పార్టీ మండల మీడియా కన్వీనర్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు -శ్రీరాముల రవి**

**సంస్థాన్ నారాయణపూం, ఆగస్టు 29(ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర మండల వావిల్లపల్లి గ్రామంలో సాయి మంచికంటి మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ చౌటుప్పల్ యశోద హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ హెల్త్ క్యాంప్ ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు పెద్ద ఎత్తున డెంటల్ పరీక్షలు, బీపీ, ఈసీజీ, షుగర్ వంటి ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని లాభం పొందారు. ఈ కార్యక్రమాన్ని మండల మీడియా కన్వీనర్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు శ్రీరాముల రవి




ముందుండి విశేష కృషి చేసి, శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. మంచికంటి భాస్కర్, డాక్టర్లు మంచికంటి వెంకటేష్ ,డాక్టర్ మంచికంటి రాజేశ్వరిని స్వయంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీరాముల రవి మాట్లాడుతూ



"మంచికంటి వారి సేవలు ప్రజలు ఎప్పటికీ మరువలేనివి. ఇది నిజమైన గొప్ప సేవ" అని ప్రశంసి చ్చారు. ఈ కార్యక్రమంలో ఐతరాజు చంద్రయ్య, శ్రీరాముల మైసయ్య, జక్కర్తి అంజయ్య, ఐతరాజు ప్రవీణ్, కృష్ణ, పడసనబోయిన బుగ్గరములు, ఎస్.కె అనిఫ్, కోల మహేష్, వరికుప్పల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేసిన రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక


**? తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి**



**రామంతపూర్, ఆగష్టు 29(ప్రభుత సూర్య):** హైదరాబాద్ రామంత పూర్ డాన్ బాస్కో అనాధ పిల్లల ఆశ్రమంను రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలో ఉన్న పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆశ్రమ ఫాదర్తో మాట్లాడటం జరిగింది. డాన్ బాస్కోల్ ఉంటున్న చిన్నారులు చదువులలో చేతివృత్తుల్లో ఎంతో ప్రావీణ్య సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదుగుతున్నందుకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని గోపి రజక అన్నారు. ప్రతిఒక్కరు సమాజానికి ఎంతో కొంత సహాయం చేయాలని చేయించాలని అన్నారు. 'పే బ్యాక్ టు సొసైటీ" అని చెప్పిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలను గుర్తుచేసుకున్నారు. చిన్నారులకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది.

## శ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నప్రసాద సేవ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో

**అమ్మవారి విగ్రహం ప్రతిష్ట మహోత్సవము**



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 29( ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలోని గుడి గుట్ట యందు శ్రీ అన్నపూర్ణేశ్వరి నిత్య అన్నప్రసాద సేవ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహం ప్రతిష్ట మహోత్సవము 29-08-2025 నుండి 31 వరకు జరుగుతుంది జరుగును కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకరనంద స్వామిజి తెలియజేశారు.

## గ్రీన్ గ్రోవ్ లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల్.ఆగస్టు 29.ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పట్టణ కేంద్రం లోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఆగస్టు 29 శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వేడుకలను పాఠశాల చైర్ పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలలో భాగంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థిని విద్యార్థులు తెలుగు వ్యవహారిక భాషోద్యమ నాయకులుగా, కవులు,రచయితల వేషధారణలో విచ్చేసి తెలుగు భాషా గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తేనె కన్నా తీయనిది తెలుగు భాషని, "దేశభాషలందు తెలుగు లెస్స" అని విద్యార్థులకు తెలిపారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రముఖహాకీ క్రీడాకారుడు ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల డైరెక్టర్ ఎస్ లక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. ధ్యాన్చంద్ స్ఫూర్తిని విద్యార్థులు పునికి పుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సంస్థాన్ గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో

**గిడుగు రామ్మూర్తి జయంతి**



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 29( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా తెలుగు భాష గొప్పతనం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులు తెలుగు బాష గురించి ఉపన్యసించారు. చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలుగు వారిగా పుట్టడం మనకు ఎంతో గర్వకారణం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ మురళి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం




**చౌటుప్పల్. ఆగష్టు 29. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండల పరిధిలోని ఎస్ లింగోటం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం " జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ " వారి సౌజన్యంతో బాల్య వివాహాలు లేని భారతదేశం కోసం స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో" బాలల హక్కుల పరిరక్షణ" లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలు నిర్మూలన కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్కోప్ మండల కోఆర్డినేటర్ బి నరసింహ రాజు మాట్లాడుతూ... విద్యార్థులను ఎవరైనా వేధించిన, బాల్య వివాహాలు చేసినట్లయితే 1098,100/112 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని, స్థానిక అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్స్, తాసిల్దార్, విలేజి సెక్రెటరీ, పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం చేరవేయాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ... బడి, ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, బాల వివాహాలు నిర్మలనకు ప్రతిజ్ఞ చేయించడంతోపాటు అవగాహన కల్పించిన స్కోప్ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి కాజా షరీఫ్, కే సోని, కే విజయ, ఎండీ నజీమైన్నిసా, తిరుమల బ్రహ్మచారి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు

-తెలుగు అధ్యాపకులు బండి వీణ అనిల్ కుమార్ రెడ్డిని సన్మానించిన ఉపాధ్యాయులు

**చౌటుప్పల్.ఆగస్టు 29. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండలం,జెడ్పిహెచ్ఎస్ లింగోజిగూడెం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలకు ప్రధానోపాధ్యాయులు కూరెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులంతా కలిసి గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని తెలుగు అధ్యాపకులు బండి అనిల్ కుమార్ రెడ్డిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు బండి అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్పతనాన్ని, వ్యవహారిక భాష విశిష్టతను, తెలుగు భాషకు గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు, వారి రచనలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కూరెళ్ల శ్రీనివాస్, మాధవరెడ్డి,అరుణ, పురుషోత్తమ చారి, రమేష్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చిన్నేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం తక్షణం చేపట్టాలి

గ్రామాలలో పేరుకుపోయిన ప్రజా సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య డిమాండ్



**భువనగిరి, ఆగష్టు 29( ప్రభాత సూర్య):** అనాజిపురం నుండి రాయిపహాడ్ తండతో పాటు వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించే చిన్నేరు వాగుపై తక్షణం బ్రిడ్జి నిర్మాణం చేయాలని, గ్రామాలలో పేరుకపోయినా ప్రజాసమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం, పెంచికల్ పహాడ్, రామకృష్ణాపురం గ్రామాలలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులకు మెమోరండాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ పెంచికల్ పహాడ్ గ్రామంలో అధిక వర్షాలతో నష్టపోయిన పదిమంది రైతులకు వెంటనే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, గ్రామంలో స్మశాన వాటిక నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, అనాజిపురం గ్రామంలో అర్హత కలిగిన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేసినారు. గ్రామాలలో రోడ్లు, మురికి కాలువలు, వీధిలైట్ల సమస్యలు చాలా పెద్ద ఎత్తున ఉన్నాయని ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి పరిష్కరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గెలిస్తే పెన్షన్స్ పెంచి ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్న నేటికీ అమలు చేయలేదని గత ఏడ ఎనిమిది సంవత్సరాలుగా అన్ని అర్హతలు ఉండి దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, వితంతులు, వృత్తిదారులకు ఇప్పటికైనా పెన్షన్స్ మంజూరు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా భూమిలేని పేదలందరికీ అమలు చేయాలని, మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయల గ్రామాల్లో ఉన్న లింకు రోడ్ల సమస్య పరిష్కరించాలని, పెంచికల్పాడు గ్రామంలో నుండి వెళ్ళుచున్న బస్వాపురం ప్రాజెక్టు కాలువకు తూములు ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో ఉన్న చెరువులన్నీ నింపి రైతాంగానికి సాగునీరు అందించాలని, భునాదిగాని కాలువలో భూములు కోల్పోతున్న రైతాంగానికి మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని అంజయ్య డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రేపు మండల తహశీల్దార్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, మండల కమిటీ సభ్యులు సిలివేరు ఎల్లయ్య, అబ్దుల్లాపురం వెంకటేష్ , సిపిఎం అనాజిపురం రెండవ శాఖా కార్యదర్శి కడారి కృష్ణ, పెంచికలపహాడ్ శాఖ కార్యదర్శి సుబ్బురు పోచయ్య, రెండు గ్రామాలకు సంబంధించిన సిపిఎం కార్యకర్తలు, ప్రజలు ఎండి వలి, బొల్లేపల్లి స్వామి, తోటకూరి మల్లేష్, కడమంచి నరసింహ, గోపి సాయిలు, సుబ్బురు లక్ష్మి, బాసాని యాదయ్య, నాగారపు నాగయ్య, కడారి మల్లయ్య, గంగదారి శంకరయ్య, బొల్లెపల్లి యాదగిరి, పన్నాల దినేష్, సిలువేరు ప్రమీల, బాలమణి, సరిత, సుజాత, లక్ష్మి, భాగ్యం మా తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





**చౌటుప్పల్. ఆగస్టు 29. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ వైద్యులు శిఖలంబట్ల రాంప్రసాద్ ఇటీవల అకాల మరణం చెందగా శుక్రవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి డాక్టర్ రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వైద్యుడిగా డాక్టర్ రాంప్రసాద్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు చెరుకు లింగస్వామి తండ్రి చెరుకు యాదయ్య ఇటీవల వారి ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. అలాగే యువజన కాంగ్రెస్ నాయకులు మాలిగ మల్లేష్ వారి నానమ్మ మాలిగ ముత్తమ్మ ఇటీవల అకాల మరణం చెందగా పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి మాలిగ ముత్తమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మునుగోడు నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బోయ దేవేందర్,సుర్వి నరసింహ గౌడ్, మోగదాల రమేష్ గౌడ్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిళ్ల మురళి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ట్రినిటీ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడ, తెలుగు భాష దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల్.ఆగస్టు 29. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో శుక్రవారం భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినంను పురస్కరించుకొని జాతీయ క్రీడ దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పాఠశాల చైర్మన్ కె.వి.బి కృష్ణారావు, ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల ధ్యాన్ చంద్, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. క్రీడా దినోత్సవం లో భాగంగా జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి మల్లఖంబ్, కబడ్డీ,తైక్వాండో, ఖోఖో, కరాటే, వాలీబాల్,క్రికెట్ క్రీడల్లో పాల్గొన్న త్రినిటి పాఠశాల విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. పాఠశాల చైర్మన్ కె. వి. బి కృష్ణారావు మాట్లాడుతూ.. ధ్యాన్ చంద్ దేశానికి ఎంతో సేవ చేశారని ఒలంపిక్స్ లో భారత జెండాని ఎగరవేశారని విద్యార్థులకు తెలిపారు. క్రీడాకారులు అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో మరింత రాణించాలని తెలిపారు. తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు, గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్ని తెలియచెప్పిన మహనీయుడు వ్యవహారిక భాషా ఉద్యమానికి మూలపురుషుడు, బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథ రచనకు స్వీకరింప చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేసిన అచ్చ తెలుగు చిచ్చరపిడుగు గిడుగు రామమూర్తి పంతులు అని వారు మాతృభాషకు చేసిన సేవలను, తెలుగు గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. మనము ఏ స్థాయిలో స్థిరపడ్డ అమ్మలాంటి మాతృభాషను మరువద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్,వెంకటేష్, గోపాల్,నరేష్, చందర్,గోవింద్, అరుణ, స్వరూప, స్వాతి, ఇందు, మంజుల,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన

గుజ్జ బీఆర్ఎస్ నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 29( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గంగాదేవి చెన్నయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గుజ్జ బిఆర్ఎస్ పార్టీ నాయకులు రూ.10 వేల రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగాదేవి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఏర్పుల సైదులు, బొల్లం ఎల్లయ్య , గంగాదేవి కృష్ణయ్య, గంగాదేవి నరసింహ, శ్రీను, ఎర్ర స్వామి, ఏర్పుల గాలయ్య, గంగాదేవి యాదయ్య, సత్తయ్య, సైదులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు....



**కొండాపూర్ ప్రభాత సూర్య :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ బి బ్లాక్ ఎమ్. వీ.ఆర్. రెసిడెన్సిలో సన్నీ యాదవ్ నిర్వహించిన గణేష్ మండపంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బలరాం యాదవ్, సన్నీ యాదవ్, నాగరాజు యాదవ్, రమేష్ యాదవ్, రాజు యాదవ్, అప్పారావు, సిహెచ్ సందీప్, అశోక్, పగిడి శివ, జైపాల్ రెడ్డి అభిషాష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఆకలితో అలమటిస్తున్న వ్యక్తికి అన్నం పెట్టిన -ఎం.డి రహీం షరీఫ్



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 29( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ మతిస్థిమితం కోల్పోయి తిరిగి ఉండడంతో ఆకలితో అలమటిస్తున్న విషయాన్ని గమనించిన మునుగోడు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకులు ఎం.డి రహీం షరీఫ్ వెంటనే అతనికి ఆకలి బాధను తీర్చి అన్నం పెట్టి కడుపు నింపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు..షరీఫ్ సేవను ఆదర్శంగా తీసుకోవాలని ఇలాంటి వారికి నీడనిచ్చే విధంగా చూడాలని అన్నారు.

## పెద్ద బండలో గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు



**నల్గొండ ఆగస్టు 29 ప్రభాత సూర్య** నల్లగొండ పట్టణం పెద్ద బండ హనుమాన్ గుడి హిందూ సేన యూత్ చింతల సత్యం సైదమ్మ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం మూడవరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తి, శ్రద్ధలతో జరుపుకోవాలని పట్టణ ప్రజలందరూ గణపయ్య ఆశీస్సులతో సుఖ సంతోషాలతో, పిల్లాపాపలతో ఆయుష్ ఆరోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కల సైదులు, శివ, శ్రీకాంత్, అజయ్, లింగస్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

## నేను రైతు బిడ్డనే...రైతుల బాధ నాకు తెలుసు...!


-ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ట్రిబుల్ ఆర్ బాధితులు

-ముఖ్యమంత్రికి రైతుల సమస్యను తెలియజేస్తా...

-మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్.ఆగస్టు 29. ప్రభాత సూర్య:** తాను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చానని,రైతుల బాధలు తనకు తెలుసునని మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం లక్కారం గ్రామ పరిధిలోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ట్రిబుల్ ఆర్ బాధిత రైతులు కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాలరెడ్డి మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ నాయకులు పలు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను మార్చారన్నారు. ఆనాటి రాజకీయ నాయకులు తప్పులు చేసి నేడు ఏం తెలియనట్లు రైతులతో కలిసి ధర్నాలు చేయిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం స్థానికంగా పలు పరిశ్రమలతో కుమ్మకయిందన్నారు. ట్రిబుల్ ఆర్ బాధిత రైతులకు నాయ్యం జరగాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు.మంచి రేటు ఇప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. ట్రిబుల్ ఆర్ భూముల సేకరణ ప్రాసెస్ ఎంతవరకు వచ్చిందని ఫోన్లో అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజుల వరకు తాత్కాలికంగా ప్రాసెస్ ను ఆపండని అధికారులకు సూచించారు. మరొక సారి అలైన్ మెంట్ గురించి అధికారులుతో చర్చిస్తానని ట్రిబుల్ ఆర్ బాధిత రైతులకు తెలిపారు. ఈ విషయమై అసెంబ్లీలో ముఖ్యమంతితో మాట్లాడి మీ సమస్యను తెలియజేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు.ఒక పార్టీకి కాదు, నేను మునుగొడు ప్రజలందరికి ఎమ్మెల్యేనని తెలిపారు.తాను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చానని రైతుల బాధలు తనకు తెలుసనని కాబట్టి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మాజీ జడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహా గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మోగదాల రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ట్రిబుల్ ఆర్ బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.






# 'మహావతార్ నరసింహ' కలెక్షన్స్.. దేశాన్ని ఏకం చేసిన గర్జన

'మహావతార్ నరసింహ' కలెక్షన్స్ పరంగా రికార్డ్ క్రియేట్ చేసింది. జులై 25న విడుదలైన ఈ యానిమేటెడ్ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించింది. సినిమా రిలీజై ఆరు వారాలు పూర్తి అయినప్పటికీ కొన్నిచోట్ల హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతుంది. దీంతో ఈ చిత్రం కలెక్షన్స్ పరంగా అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక పోస్టర్‌ను పంచుకుంది. 'మహావతార్ నరసింహ' చిత్రం రూ. 300 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిపోయింది. ఇండియా బిగ్గెస్ట్ యానిమేటెడ్ చిత్రంగా నిలిచిందంటూ నిర్మాణ సంస్థ హొంబాలే ఫిల్మ్స్ ప్రకటించింది. దేశాన్ని ఏకం చేసిన నరసింహ గర్జన అంటూ పేర్కొంది. శ్విన్ కుమార్ దర్శకత్వంలో హొంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధవాన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ సంయుక్తంగా 'మహావతార్ నరసింహ' యానిమేటెడ్ చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగులో గీతా ఆర్ట్స్ బ్యానర్ నుంచి అల్లు అరవింద్ విడుదల చేశారు. కేవలం తెలుగులోకే రూ. 47 కోట్ల నెట్ రాబట్టి రికార్డ్ క్రియేట్ చేసింది.

# వాడి ప్రేమకథలో వేలు పెడితే ఇలాగే ఉంటుంది.. 'మోగ్లీ' గ్లింప్స్




రోషన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ' తాజాగా ఈ చిత్రం నుంచి గ్లింప్స్ విడుదలైంది. రాజీవ్ కనకాల- సుమ వారసుడిగా చిత్రపరిశ్రమలో ఎంట్రీ ఇచ్చిన రోషన్ 'మోగ్లీ' ప్రేమకథతో వస్తున్నాడు. తాజాగా విడుదలైన గ్లింప్స్ నాని వాయిస్‌తో మొదలౌతుంది. 25 సంవత్సరాలు నిండని ఓ కుర్రాడు 30 మందిని తిండి, నిద్ర లేకుండా పరిగెత్తించాడంటూ నాని వాయిస్‌తో డైలాగ్ ప్రారంభమౌతుంది. వాడు గ్యాంగ్ స్టర్ కాదు, క్రిమినల్ కాదంటూనే వాడి కథేంటో తెలుసుకోవాలంటే మోగ్లీ చూడాలని చెప్పాడు. ఇందులో హీరోయిన్‌గా సాక్షి సాగర్ నటించారు. కలర్‌ఫోటో సినిమా దర్శకుడు సందీప్ రాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.




# బీర్ అనేది ఒక ఎమోషన్.. ఆసక్తికరంగా తమన్నా కొత్త వెబ్ సిరీస్ ట్రైలర్

ఇటీవలే 'ఓదెల 2'తో ప్రేక్షకులను అలరించిన మిల్కీ బ్యూటీ తమన్నా ఈసారి వెబ్ సిరీస్‌తో అలరించడానికి ప్రేక్షకుల ముందుకు వస్తుంది. నటి తమన్నా బాలీవుడ్ నటి డయానా పెంటీ ప్రధాన పాత్రల్లో వస్తున్న తాజా వెబ్ సిరీస్ 'డు యూ వనా పార్ట్‌నర్' కాలిన్, అర్చిత్‌కుమార్ ఈ వెబ్ సిరీస్‌కు సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' ఒరిజినల్ సిరీస్‌గా ఈ చిత్రం రుపొందుతుంది. ఈ వెబ్ సిరీస్ సెప్టెంబర్ 12 నుంచి స్ట్రీమింగ్ కాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కార్పోరెట్ జాబ్‌లతో విసిగిపోయిన ఇద్దరు స్నేహితులు స్వయంగా బీర్ తయారు చేసి కంపెనీ పెడదం అనుకుంటారు. ఈ క్రమంలో వారికి ఎదురైన అనుభవాలు ఏంటి అనేది ఈ వెబ్ సిరీస్ స్టోరీ అని తెలుస్తుంది. కామెడీ అండ్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ రాబోతుంది.

# పెళ్లి పీటలెక్కనున్న విశాల్.. హీరోయిన్ సాయి ధన్సికతో నిశ్చితార్థం



కోలీవుడ్ అగ్ర నటుడు విశాల్, నటి సాయి ధన్సిక వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. నేడు విశాల్ విశాల్ పుట్టినరోజు సందర్భంగా వీరి నిశ్చితార్థం చెన్నైలోని విశాల్ నివాసంలో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ జంట తమ ప్రేమ విషయాన్ని మే నెలలోనే వెల్లడించిన విషయం తెలిసిందే. నిజానికి ఈరోజు వీరి వివాహం జరగాల్సి ఉండగా.. నడిగర్ సంఘం భవన(తమిళ ఫిల్మ్ అసోసియేషన్) నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉన్నందున వివాహాన్ని వాయిదా వేసుకున్నారని తెలుస్తోంది. హీరోయిన్ ధన్సిక విషయానికి వస్తే.. హీరోయిన్ పక్కన జూనియర్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఈ అమ్మడు రజనీకాంత్ కబాలి సినిమాతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారింది. ఈ సినిమాలో సూపర్ స్టార్ కూతురిగా నటించడంతో అందరి కళ్లు ఈ ముద్దుగుమ్మపై పడ్డాయి. అనంతరం తమిళంతో పాటు తెలుగులో ఫుల్ బిజీగా మారింది ఈ అమ్మడు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.